శక్తిస్వరూపిణి.. పాహిమాం

శరన్నవరాత్రి ఉత్సవాలు మూడవ రోజు బుధవారం వైభవంగా నిర్వహించారు. మదనపల్లె పట్టణంలోని అమ్మవారి ఆలయాలన్నీ నవరాత్రి శోభతో ఉట్టిపడుతున్నాయి. భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. సాయంత్రం నిర్వాహకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారాలతో కొలువుదీర్చారు. భక్తుల సంఖ్య ఎక్కువ కావడంతో దర్శనాల కోసం వేచి చూడాల్సి వచ్చింది. సాయంత్రం నుంచి ఆలయాల సమీప వీధులు జనసంద్రలయ్యాయి. స్థానిక వాసవీభవన్‌వీధిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. స్థానిక ఈస్టుపేట, నాదెళ్లనారప్పవీధి, షిర్డిసాయిబాబా గుడి, వేమనవీధి, కమ్మగడ్డవీధుల నుంచి మహిళలు సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. కోర్టులో గంగమ్మ స్వర్ణకవచ అలంకారం చేశారు. అలాగే రామసముద్రం, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం గుర్రంకొండ, కలకడ, ములకలచెరువు, బి.కొత్తకోట మండలాల్లో అమ్మవారు అన్నపూర్ణేశ్వరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పలుచోట్ల అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



మదనపల్లె: వారాహి అలంకారం | పీలేరు: అన్నపూర్ణాదేవి అలంకరణ | గుర్రంకొండ: అన్నపూర్ణాదేవిగా..



ములకలచెరువు: సైలపుత్రి అలంకరణ, బి.కొత్తకోట: దుర్గాదేవికి పూజలు, కలికిరి: అన్నపూర్ణాదేవిగా..

రెడ్డెమ్మకొండ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మకొండ ఆలయ అభివృద్ధి కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. రాయచోటి దేవదాయశాఖ అధికారి శశికుమార్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా లంకిపల్లి రాజన్న నాయుడు, పాలకవర్గ సభ్యులుగా ఎనిమిది మంది ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మంజుల, టీడీపీ నాయకులు నాయిని జగదీష్, ఎల్లుట్ల మురళీ, ప్రసాద్‌నాయుడు, హరిప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రమాలల సమర్పణ

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి పవిత్ర మాలల సమర్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారి పవిత్ర ఉత్సవాల్లో భాగంగా రెండవరోజైన బుధవారం టీటీడీ వారి ఆధ్వర్యంలో పవిత్రమాలల సమర్పణ, శాంతి హోమాలు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి స్నపన తిరుమంజనం కావించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.

ఎమ్మెల్యే నివాళి

బి.కొత్తకోట: మండలంలోని బుచ్చిరెడిగారిపల్లెలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈ.వెంకటరమణ మృతదేహానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి బుధవారం నివాళులర్పించారు. పార్టీకి ఆయనచేసిన సేవలను కొనియాడారు. కుటుంబీకులను పరామర్శించారు. ఎమ్మెల్యేతోపాటు మాజీ ఎంపీపీ పాగొండ ఖలీల్, మాజీ సర్పంచు ప్రమీల దేవేంద్రరెడ్డి, కందుకూరు వెంకటేశ్వరెడ్డి, కాలువపల్లె మధు, కిశోర్, సాయి, నక్కా మహేష్, జయచంద్రారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో సేవా స్ఫూర్తి

బి.కొత్తకోట: ఎన్‌ఎస్‌ఎస్‌తో ప్రతి విద్యార్థిలో సేవా స్ఫూర్తి కలుగుతుందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.గోపాల్ నాయక్ అన్నారు. బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ డే సందర్భంగా కళాశాలలో సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విధిగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. పరిసరాల శుభ్రత, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, సమాజ సమస్యలపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

పనిగంటల బిల్లుకు నిరసనగా ధర్నా

మదనపల్లె: కార్మికుల పనిగంటలను పెంచుతూ అసెంబ్లీ ఆమోదం పొందిన బిల్లును నిరసిస్తూ బుధవారం ఏఐటియూసీ అధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 8 నుంచి 13 గంటలకు పని భారం వద్దంటూ నినాదాలు చేశారు. బిల్లుపై చేసిన తీర్మాణం వెనుక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.